నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, శనివారం 31 మే 2025 | BHADRADRI KOTHAGUDEM

560 కేజీల నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత

- 11 మంది నిందితుల అరెస్టు, రిమాండ్‌కు తరలింపు
- నకిలీ విత్తన తయారీ కేంద్రంపై టాస్క్‌ఫోర్స్ దాడులు
- వివరాలు వెల్లడించిన పోలీస్ కమిషనర్ సునీల్‌దత్

ఖమ్మం, మే 30 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మూడు వేర్వేరు కేసుల్లో రూ.14 లక్షల విలువ చేసే 560 కేజీల నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకొని, 11 మంది నిందితులను అరెస్టు చేసినట్లు ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. ఖమ్మం జిల్లా ఏన్కూరు పోలీస్ స్టేషన్ ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీపీ వివరాలు వెల్లడించారు. ఈ నెల 28న టాస్క్ ఫోర్స్, పోలీస్, వ్యవసాయాధికారులు ఏన్కూరుకు చెందిన గాజుల నర్సింహారావు అనే వ్యక్తి రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నట్లు సమాచారం అందిన వెంటనే తనిఖీలు నిర్వహించి.. అతడి వద్ద నుంచి వివిధ పేర్లతో ఉన్న 450 గ్రాముల బరువున్న పత్తి విత్తన ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ విత్తనాలు ఏపీ రాష్ట్రం మైలవరం నుంచి తీసుకొచ్చి ఇక్కడ విక్రయిస్తున్నట్లు విచారణలో తెలిందన్నారు. దీనిపై ప్రత్యేక బృందం మైలవరం మండలం చంద్రుగూడెం గ్రామంలో విచారణ చేపట్టగా.. శాలివాహన అనే వ్యక్తి ఇంట్లో కుటీర పరిశ్రమగా పెట్టుకుని నకిలీ విత్తనాలు తయారు చేస్తున్నట్లు వెలుగుచూసిందన్నారు. సదరు నిందితుడు కర్ణాటక నుంచి విత్తనాలు, 555 నెంబర్ పేరుతో కవర్లను తీసుకొచ్చి ఇక్కడ తయారు చేసి ఏజెంట్ల ద్వారా విక్రయిస్తున్నట్లు తేలిందన్నారు. నిందితుడి ఇంటి వద్ద క్వింటా రోజోబెల్ మిశ్రమం కలిపి ప్యాక్ చేయని పత్తి విత్తనాలు, అరుణోదయ లేబుల్‌తో 450 గ్రాముల బరువున్న 272 పత్తి విత్తన ప్యాకెట్లు, సీల్ వేయడానికి వాడే రెండు మిషన్లు, వేయింగ్ మిషన్, ఖాళీ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఈ నెల 27న పోలీసులు, వ్యవసాయాధికారులు ఏన్కూరు మండలం రేపల్లెవాడ శివారులో నకిలీ విత్తనాలు అమ్ముతున్నాడనే సమాచారంతో వెనిగండ్ల శ్రీనివాసరావు అనే వ్యక్తి వ్యవసాయ భూమిలో తనిఖీలు నిర్వహించగా.. 210 ప్యాకెట్లలో ఉన్న ఒక కేజీ నకిలీ విత్తనాలు బయటపడ్డట్లు తెలిపారు. నిందితుడిని విచారించగా.. అతడి అనుచరుడు ఇమ్మినేని కిషోర్ వద్ద 120 కిలోల పత్తి విత్తనాలు లభ్యమైనట్లు తెలిపారు. నిందితులు ఇద్దరూ ఏపీ రాష్ట్రం బాపట్ల నుంచి వారి బంధువు లక్ష్మీనారాయణ ద్వారా నకిలీ విత్తనాలు ఇక్కడికి తీసుకొచ్చి రైతులకు విక్రయిస్తున్నట్లు తేలిందన్నారు. అదేరోజు పక్కా సమాచారంతో ఏన్కూరు పరిధిలోని పోలేటి కోటేశ్వరరావు ఇంటి వద్ద తనిఖీలు చేయగా.. 20 నకిలీ పత్తి విత్తన ప్యాకెట్లు లభించాయని, విచారణలో ఏపీ రాష్ట్రం తెనాలి నుంచి తీసుకొచ్చి విక్రయిస్తున్నట్లు తేలిందన్నారు. పై మూడు కేసులలో నిందితులుగా ఉన్న వెనిగండ్ల శ్రీనివాసరావు, ఉమ్మనేని నరేశ్, అన్నెం లక్ష్మీనారాయణ, గుగులోత్ గోపి, వరదబోయిన రమేశ్, తాంబళ్ల నవీన్, దొంతబోయిన రమేశ్, గాజుల నర్సింహారావు, చర్లపల్లి శాలివాహన, పోలేటి కోటేశ్వరరావు, వెనిగండ్ల రవిలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. వీరి వద్ద నుంచి మొదటి కేసులో ఒక కేజీ బరువున్న 330 పత్తి విత్తన ప్యాకెట్లు, 2 లీటర్ల రోజోబిన్ కెమికల్, త్రాసు, రెండో కేసులో ఒక క్వింటా లూజు పత్తి విత్తనాలు, 450 గ్రాముల బరువున్న 270 అరుణోదయ, అడ్వాన్స్ 555 పేరుతో ఉన్న పత్తి విత్తన ప్యాకెట్లు, లీటర్ రోజోబిన్ కెమికల్, వేయింగ్ మిషన్, సీల్ వేసే యంత్రం, 400 ఖాళీ ప్యాకెట్లు, మూడో కేసులో 450 గ్రాముల బరువుతో పల్లవి సీడ్స్ పేరుతో ఉన్న 20 ప్యాకెట్ల పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో కల్లూరు ఏసీపీ రఘు, సత్తుపల్లి రూరల్ సీఐ ముత్తిలింగం, ఎస్సైలు రఫీ, హరిత తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తన ప్యాకెట్లను పరిశీలిస్తున్న సీపీ సునీల్‌దత్

రేడియాలజిస్టులు లేకుండా రిపోర్టులా?

- సరైన ఎక్విప్‌మెంట్ లేకుండా వైద్య పరీక్షలు ఎలా సాధ్యం?
- అయినప్పటికీ రోగులకు అందుతున్న వైద్య పరీక్షల రిపోర్టులు
- భద్రాద్రి జిల్లాలో డయాగ్నస్టిక్, స్కానింగ్ సెంటర్ల ఇష్టారాజ్యం
- రోగుల ప్రాణాలతో చెలగాటం.. పర్యవేక్షణ వ్యవస్థల మౌనం..
- సుస్తీ చేసిందని వెళ్తే లెక్కకు మిక్కిలి టెస్టులు రాస్తున్న వైద్యులు
- ల్యాబ్‌లకు వెళ్తే ముక్కుపిండి వసూలు చేస్తున్న నిర్వాహకులు
- వైద్యుల కనుసన్నల్లో ల్యాబ్‌లు.. మొక్కుబడిగా వైద్యశాఖ తనిఖీలు

రోగ నిర్ధారణలో ఎంతో కీలకమైన ల్యాబ్ రిపోర్టులు రేడియాలజీ నిపుణుల నిర్ధారణ లేకుండా రోగుల చేతికి అందుతున్నాయి. రోగ నిర్ధారణలో ప్రామాణికత కోసం అధునాతన ఎక్విప్‌మెంట్ అందుబాటులోకి వచ్చినప్పటికీ.. కొన్ని ల్యాబ్‌లు మాత్రం లాభాపేక్షే లక్ష్యంగా ముందుకు సాగుతూ వాటి జోలికి వెళ్లడం లేదు. పాత ఎక్విప్‌మెంట్లతోనూ, అందునా తెలిసీ తెలియని సిబ్బందితోనూ రోగ నిర్ధారణ పరీక్షలు చేస్తూ, చేయిస్తూ రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి. పర్యవేక్షణ వ్యవస్థలు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతో భద్రాద్రి జిల్లాలోని ప్రైవేటు డయాగ్నస్టిక్, స్కానింగ్ సెంటర్ల విచ్చలవిడి తనానికి అడ్డూఅదుపూ లేకుండా పోతోంది. ప్రైవేటు వైద్యుల కనుసన్నల్లోనే ల్యాబ్‌లు కొనసాగుతుండడం, సుస్తీ చేసిందని రోగులు వెళ్తే లెక్కకు మిక్కిలి టెస్టులు రాస్తుండడం, ఆ లిస్టు తీసుకొని ల్యాబ్‌కు వెళ్తే అక్కడ రోగుల ప్రాణాలను రిస్కులో పెట్టి మరీ నిలువు దోపిడీ చేస్తుండడం వంటివి పరిపాటిగా మారాయి. ఎక్కడో ఒకచోట రోగుల ప్రాణాలు పోయినప్పుడు కొన్ని రోజులపాటు వైద్య శాఖ హడావిడి చేయడం, మొక్కుబడిగా తనిఖీలు చేపట్టడం, ఒకటో రెండో ల్యాబ్‌లు సీజ్ చేయడం, ఆ తరువాత అవి మళ్లీ తెరుచుకోవడం వంటివి షరా మామూలుగానే జరుగుతుండడం గమనార్హం. -భద్రాద్రి కొత్తగూడెం, మే 30 (నమస్తే తెలంగాణ)

జాతీయ వైద్య మండలి వైద్య ప్రమాణాలను భద్రాద్రి జిల్లాలోని డయాగ్నస్టిక్, స్కానింగ్ సెంటర్లు పట్టించుకుంటున్న పరిస్థితి కన్పించడం లేదు. డయాగ్నస్టిక్, స్కానింగ్ సెంటర్లలో రోగ నిర్ధారణను తప్పనిసరిగా సదరు రేడియాలజీ వైద్య నిపుణులే చేయాల్సి ఉంటుంది. కానీ.. జిల్లాలోని అనేక ల్యాబ్‌లలో రేడియాలజిస్టులు, సదరు విభాగాల వైద్య నిపుణులు లేకుండా రోగులకు రిపోర్టులు అందుతున్నాయి. సరైన ఎక్విప్‌మెంట్ కూడా లేని కొన్ని ల్యాబ్‌లలో అక్కడి సిబ్బంది, కాస్త అనుభవమున్న సిబ్బంది పరీక్షలు చేస్తుండడం గమనార్హం. రేడియాలజిస్టులు రోగాన్ని నిర్ధారించి సంతకం చేసి ఇవ్వాల్సిన రిపోర్టులపై అక్కడి సిబ్బంది సంతకం చేసి ఇస్తున్న ఘటనలు కూడా ఉన్నాయి.



తూతూమంత్రంగా తనిఖీలు..

ప్రైవేటు డయాగ్నస్టిక్ సెంటర్లతోపాటు ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యులే ల్యాబ్‌లను ఏర్పాటు చేసుకోవడం వల్ల వైద్యారోగ్య శాఖ అధికారులు కూడా తూతూమంత్రంగానే తనిఖీలు చేస్తున్నారు. అనుమతులు లేని కారణంగా ఇటీవల మణుగూరులో ఒక డయాగ్నస్టిక్ సెంటర్‌ను, కొత్తగూడెంలో ఒక డయాలసిస్ సెంటర్‌ను అధికారులు సీజ్ చేశారు. కానీ.. అనుమతుల్లేకుండా జిల్లాలో కోకొల్లలుగా ఉన్న డయాగ్నస్టిక్ సెంటర్లను చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. టెస్టుల పేరుతో ల్యాబ్‌లలో అధిక ఫీజులు వసూలు చేస్తున్నా స్పందించిన దాఖలాలు లేవు.

143 ప్రైవేటు ల్యాబ్‌లు..

భద్రాద్రి జిల్లాలో 423 ప్రైవేటు ఆసుపత్రులు, 143 డయాగ్నస్టిక్ సెంటర్లు ఉన్నాయి. ఇవన్నీ ప్రైవేటు వైద్యులు నెలకొల్పుకున్నవి, వారి కనుసన్నల్లో నడిచేవే. ఇక స్కానింగ్ సెంటర్లు 77, గైనిక్ ల్యాబ్‌లు 60, రేడియాలజీ ల్యాబ్‌లు 12, టుడీ ఎకో ల్యాబ్‌లు రెండు ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో డయాగ్నస్టిక్ సెంటర్ ఉన్నప్పటికీ రోగులు ప్రైవేటును ఆశ్రయించడం వల్ల ల్యాబ్‌ల నిర్వాహకులు ఫీజులతో పీల్చిపిప్పి చేస్తున్నారు. గర్భిణులు నెలకు రెండుసార్లు తప్పనిసరిగా చెకప్ చేయించుకోవాల్సి రావడంతో వారు ప్రసవించే సమయానికి ఈ స్కానింగ్‌లకే అధిక మొత్తం ఖర్చవుతోంది.

మణుగూరులో అనుమతులు లేని డయాగ్నస్టిక్ సెంటర్‌ను సీజ్ చేస్తున్న అధికారులు(ఫైల్)



కొత్తగూడెంలో డయాగ్నస్టిక్ సెంటర్లలో అధిక రేట్లతో ఉన్న పరీక్షల ధరల పట్టిక

కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు..?

ప్రైవేటు ల్యాబ్‌లు అధిక ఫీజులు వసూలు చేస్తున్న విషయం ఇటీవల కలెక్టర్ దృష్టికి వెళ్లింది. దీంతో ఆయన వెంటనే ప్రైవేటు ల్యాబ్‌ల యజమానులు, వైద్యులతో సమావేశం నిర్వహించారు. ఫీజులను 30 శాతం తగ్గించాలని ఆదేశించారు. కానీ.. అవి బేఖాతరైనట్లుగానే కన్పిస్తోంది.

ఒక్క జబ్బుకు అనేక టెస్టులు రాస్తున్నారు..

ఒక జబ్బు వచ్చిందని ప్రైవేటు ఆసుపత్రికి వెళ్తే అక్కడి వైద్యులు అనేక టెస్టులు రాస్తున్నారు. అవన్నీ చేయించుకునే సరికి తెచ్చుకున్న డబ్బులన్నీ అయిపోతున్నాయి. పరీక్షల పేరిట ప్రైవేటు వైద్యులు రాసి ఇస్తున్న టెస్టుల లిస్టులు చూస్తే భయాందోళన కలుగుతున్నప్పటికీ చేయించుకోక తప్పని పరిస్థితి అవుతోంది.

-టి.సత్యవతి, మణుగూరు

డబ్బులన్నీ పరీక్షలకే అయిపోతున్నాయి..

ప్రభుత్వ ఆసుపత్రికి వెళితే సమయానికి వైద్యులుండరు. అందువల్ల ప్రైవేటుకు వెళితే పరీక్షల పేరు చెప్పి వారు దోపిడీ చేస్తున్నారు. డబ్బులన్నీ ల్యాబ్ టెస్టులకే అయిపోతున్నాయి. చిన్న డౌట్ ఉండి ఆసుపత్రికి వెళ్లినా టెస్టులు మాత్రం తప్పడంలేదు. గర్భిణులకు నెలకు రెండుసార్లు టెస్టులు కంపల్సరీ కావడంతో కచ్చితంగా వెళ్లాల్సి వస్తోంది.

-ఉషాకిరణ్మయి, గర్భిణి, కొత్తగూడెం

సమాచారం వస్తే తనిఖీలు చేస్తున్నాం..

ల్యాబ్‌లలో అధికంగా ఫీజులు వసూలు చేసినట్లు ఫిర్యాదులు అందినా, సమాచారం వచ్చినా వెంటనే వెళ్లి తనిఖీలు చేస్తున్నాం. నిబంధనలను అతిక్రమించిన ల్యాబ్‌లను సీజ్ చేస్తున్నాం. ఇప్పటికే రెండు ల్యాబ్‌లను సీజ్ చేశాం. స్కానింగ్ సెంటర్లను కూడా తనిఖీ చేస్తున్నాం. జిల్లా ఆసుపత్రిలో డయాగ్నస్టిక్ సెంటర్ అందుబాటులో ఉంది. అక్కడ మొత్తం 155 పరీక్షలు చేస్తున్నాం.

-భాస్కర్‌నాయక్, డీఎంహెచ్‌వో, భద్రాద్రి

విపత్తు వేళ ముందస్తు ప్రణాళిక ముఖ్యం

- 12 రోజులపాటు 300 మంది వలంటీర్లకు శిక్షణ
- విపత్తుల నిర్వహణపై సమావేశంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

మామిళ్లగూడెం, మే 30 : వర్షాలు, వరదల వంటి విపత్తు సమయంలో ముందస్తు ప్రణాళికతో వెళితే ఆస్తి, ప్రాణనష్టం, విలువైన వస్తువులు కోల్పోకుండా చూడవచ్చని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. విపత్తుల నిర్వహణపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులు, ఆపద మిత్రులకు శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. గత ఏడాది ఆగస్టు 29 నుంచి సెప్టెంబర్ మొదటి తేదీ వరకు వచ్చిన వరదల వల్ల నగరం ఆపదలో చిక్కుకున్నదని, జిల్లా అధికారులు, స్వచ్ఛంద సంస్థలు అద్భుతంగా పని చేయడంతో అతి తక్కువ ప్రాణనష్టంతో బయటపడ్డామని, 15 రోజుల వ్యవధిలోనే సాధారణ స్థితికి తీసుకొచ్చామని తెలిపారు. ప్రస్తుతానికి మహబూబాబాద్, వరంగల్ జిల్లాల్లో కురిసే వర్షం వివరాలను అంచనా వేస్తున్నామని తెలిపారు. వచ్చే బుధవారం మండల స్థాయిలో అపదమిత్రుల పరిచయ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జిల్లాలో ప్రమాద సమాచారం కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్ నెంబర్ 1077కు అందిన వెంటనే కంట్రోల్ రూమ్ నుంచి సమాచారం అందుతుందని తెలిపారు. 12 రోజుల్లో 300 మంది శిక్షణ పొందిన వలంటీర్లు ఆపద సమయంలో ప్రజలకు సేవలు అందిస్తారన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో శిక్షణ ఉంటుందని తెలిపారు. అనంతరం వలంటీర్లకు కలెక్టర్ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో సన్యాసయ్య, సీపీవో శ్రీనివాస్, టీజీఎన్పీడీసీఎల్ ఎస్ఈ శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

కార్పొరేట్ సంస్థల కోసమే 'ఆపరేషన్ కగార్'

- అడవుల నుంచి ఆదివాసీలను తరిమేయడానికే కేంద్రం కుట్రలు
- అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క ఆరోపణ
- 'ఆపరేషన్ కగార్'కు వ్యతిరేకంగా గుండాల మండల కేంద్రంలో ర్యాలీ

గుండాల, మే 30 : ఏజెన్సీ ప్రాంతంలోని విలువైన ఖనిజ సంపదను కార్పొరేట్ సంస్థల యజమానులు అంబానీ, అదానీలకు కట్టబెట్టేందుకు.. అమాయకులైన ఆదివాసీలను అడవుల నుంచి తరిమేయడానికే కేంద్ర ప్రభుత్వం 'ఆపరేషన్ కగార్' పేరిట మానవ దహనానికి పూనుకున్నదని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క ఆరోపించారు. మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ కగార్'ను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ గుండాల మండల కేంద్రంలో రైతుకూలీ సంఘం(ఆర్‌సీఎస్), అఖిల భారత రైతుకూలీ సంఘం(ఏఐకేఎంఎస్), ఆలిండియా ఖేత్ మజ్దూర్-కిసాన్ సభ, తుడుందెబ్బ ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. తొలుత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విమలక్క మాట్లాడుతూ కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా 2026 మే నెల వరకు మావోయిస్టులను తుదముట్టిస్తామని రాజ్యాంగ విరుద్ధమైన వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. మావోయిస్టులు స్వచ్ఛంద కాల్పులు విరమణ ప్రకటించినా.. దానిని స్వాగతించకుండా కేంద్ర ప్రభుత్వం వేలాదిగా సైనిక బలగాలను అడవుల్లోకి దింపి మావోయిస్టు నేతలతోపాటు అమాయక ఆదివాసీలను కాల్చి చంపుతూ ఎన్‌కౌంటర్ల పేర మానవ దహనం కొనసాగిస్తోందన్నారు. తర్వాత వారి మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించకుండా ప్రభుత్వమే దహనం చేయడం అప్రజాస్వామికమన్నారు. ఇటీవల మావోయిస్టు పార్టీ అగ్ర నేత నంబాల కేశవరావు అలియాస్ బస్వరాజ్‌తోపాటు 26 మంది ఆదివాసీలను ఎన్‌కౌంటర్ పేరిట క్రూరంగా కాల్చి చంపారని, ఆపరేషన్ కగార్ పేరిట 2024 నుంచి ఇప్పటివరకు జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్లపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి చేత న్యాయ విచారణ జరిపించాలని మానవ సంఘాల పక్షాన ఆమె డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) నాయకులు ప్రసాదన్న, ఊక్లానాయక్, రైతుకూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పటోళ్ల నాగిరెడ్డి, వివిధ సంఘాల నాయకులు వెల్తురు సదానందం, కొడెం వెంకటేశ్వర్లు, ఎట్టి ప్రశాంత్, కందగట్ల సురేందర్, పొమ్మన్న, బొమ్మెర్ల రాంబాబు, చంద్రయ్య దొర, మోకాళ్ళ సమ్మయ్య, మండల యుగేందర్, పల్స యాదగిరి, ఆరెళ్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గుండాల మండల కేంద్రంలో బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న విమలక్క

నాణ్యమైన విద్య కోసమే శిక్షణ

- మూడు విడతలుగా 15 రోజులపాటు నిర్వహణ
- ముగింపు సమావేశంలో డీఈవో సామినేని సత్యనారాయణ

ఖమ్మం అర్బన్, మే 30 : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మరింత నాణ్యమైన విద్యను అందించేందుకే ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు డీఈవో సామినేని సత్యనారాయణ పేర్కొన్నారు. జిల్లాలోని వివిధ మేనేజ్‌మెంట్ల కింద పనిచేసే 5 వేల మంది ఉపాధ్యాయులకు జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో 15 రోజులపాటు మూడు విడతలుగా నిర్వహించిన శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. రోటరీనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, హార్వెస్ట్, న్యూఇరా, న్యూవిజన్ పాఠశాలల్లో నిర్వహించిన శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమంలో డీఈవో పాల్గొని ప్రసంగించారు. జూన్ 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థుల తల్లిదండ్రులు ఆశిస్తున్నట్లుగా వారి పిల్లలకు నాణ్యమైన విద్యను అందించేందుకు శిక్షణలు తోడ్పడాలన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను పాఠశాలల్లో అమలు చేసే విధంగా ఉపాధ్యాయులు సిద్ధంగా ఉండాలన్నారు. కాగా.. జిల్లా కేంద్రంలోని నాలుగు సెంటర్లలో స్కూల్ అసిస్టెంట్లు, ఉన్నత పాఠశాలల హెచ్ఎంలకు శిక్షణ ఇచ్చారు. అన్ని మండల కేంద్రాల్లో ఎస్‌జీటీ, ఎల్ ఎఫ్ఎల్ ఉపాధ్యాయులకు శిక్షణ పూర్తి చేశారు. ప్రధానంగా బోధనా పద్ధతులు, టెక్నాలజీ వినియోగం, జీవన నైపుణ్యాలు, ఇతర అంశాలపై నిర్వహించిన శిక్షణా తరగతులు విజయవంతమైనట్లు డీఈవో సత్యనారాయణ, జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ కేశవపట్నం రవి కుమార్ తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో డీసీపీవో విష్ణు వందన, సెంటర్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డీఈవో సామినేని సత్యనారాయణ

కోల్‌బెల్ట్ ఏరియాల్లో 'ఆవిర్భావ' వేడుకలు

వివరాలు వెల్లడించిన సింగరేణి డైరెక్టర్(పా) వెంకటేశ్వర్లు

కొత్తగూడెం సింగరేణి, మే 30 : తెలంగాణ రాష్ట్ర 11వ అవతరణ దినోత్సవ వేడుకలను కోల్‌బెల్ట్ ఏరియాల్లో అత్యంత వైభవంగా నిర్వహించనున్నామని, కొత్తగూడెం ప్రకాశం స్టేడియం వేదికగా నిర్వహించనున్న ప్రధాన వేడుకల్లో సీఎండీ బలరాం ముఖ్యఅతిథిగా పాల్గొంటారని డైరెక్టర్(పా, పీపీ) వెంకటేశ్వర్లు వెల్లడించారు. కొత్తగూడెంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అవతరణ దినోత్సవ వేడుకల వాల్ పోస్టర్‌ను ఆయన వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉదయం 9 గంటలకు ప్రధాన కార్యాలయంలో జెండా ఆవిష్కరణ, తర్వాత తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం ప్రకాశం స్టేడియం, బస్టాండ్ సెంటర్ మీదుగా అమరవీరుల స్థూపం వరకు తెలంగాణ రన్ నిర్వహించి అమరవీరులకు నివాళులర్పించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9:15 గంటలకు సీఎండీ జెండా ఆవిష్కరణ చేస్తారని, తర్వాత ఎస్‌అండ్‌పీసీ, స్కౌట్స్ అండ్ గైడ్స్ సమర్పించే గౌరవ వందనం స్వీకరించి సందేశం ఇస్తారన్నారు. సాయంత్రం 6 గంటల నుంచి ప్రకాశం స్టేడియంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని, సింగరేణీయులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జీఎంలు కవితానాయుడు, కిరణ్‌కుమార్, ఏజీఎం రాజేంద్రప్రసాద్, డీజీఎం ముకుంద సత్యనారాయణ, డీవైపీఎం జీకే కిరణ్‌కుమార్, సీనియర్ పీవో శ్రీనివాసరావు, ఉదయ్‌కుమార్, వరప్రసాద్‌రావు, ఎంసీ పాస్‌నెట్, ఇజాజ్ షరీఫ్ పాల్గొన్నారు.

వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వర్లు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616